తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## ఎస్వీయూకు 40 లక్షల భూరి విరాళం

తిరుపతి విద్య జనవరి 25 ప్రభాతవార్త



ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మాజీ విద్యార్థి, హైదరాబాద్‌కు చెందిన జి ఆర్ పవర్ స్విచ్ గేర్ సంస్థ అధిపతి సి గోపాల్ రెడ్డి 40 లక్షలతో ఎస్వియు ఇంజనీరింగ్ విద్యార్థినుల కొరకు నిర్మిస్తున్న హాస్టల్ సముదాయం నందు వంటశాల, భోజన శాల ను నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ ఉప కులపతి ఆచార్య అప్పా రావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడులు దాత గోపాల్ రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ సుబ్బా రావు, ఆచార్య కేయం భాను, హాస్టల్ వార్డెన్ ఆచార్య గౌరీ శంకర్ రెడ్డి, వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్రదినోత్సవానికి టిటిడి ముస్తాబు



తిరుపతిలో 70వ గణతంత్రదినోత్సవం సందర్భంగా టిటిడి పరిపాలన భవనం ముస్తాబైంది. అంకితభావ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తారు.

ప్రభాతవార్త-తిరుపతి

### గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని

## పోలీసు కవాతు రిహార్సల్స్



జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో రిపబ్లిక్‌డే వేడుకల రిహార్సల్స్ నిర్వహిస్తున్న పోలీసులు

చిత్తూరు, జనవరి 25 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణా మైదానంలో ఆదివారం జరుగున్న గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని శనివారం పోలీసు శాఖ పోలీసు కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ పోలీసు కవాతు రిహార్సల్స్‌ను ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్‌తో కలిసి పెరేడ్ నిర్వహణను పరిశీలించి ముఖ్య అతిధుల హాజరు, వారి సిట్టింగ్, జాతీయ పతాక ఆవిష్కరణ, జాతీయ జెండాకు గౌరవ వందనం చేయడం, వాహనంపై వెళ్ళి పెరేడ్‌ను పరిశీలించడం తదితర అంశాలపై రిహార్సల్స్ చేయించారు.

# 'మార్పు' సాధ్యమేనా సారూ!

### పోలీసుస్టేషన్‌కు వెళ్ళాలంటేనే జడుసుకుంటున్న సామాన్యజనం

### -ఫిర్యాదు ఇవ్వకముందే పోలీసుల యక్షప్రశ్నలు



ప్రభాతవార్త-తిరుపతి:

ప్రజలతో ఫ్రెండ్లీపోలిసింగ్ మాట ఏమైనా....ప్రజలకు స్నేహపూర్వక సేవలు మాటలెలా ఉన్నా సామాన్యజనం తమకు ఎదురైన సమస్యలు, జరిగిన అన్యాయం, అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి పోలీసుస్టేషన్‌లకు వెళ్ళాలంటేనే జడుసుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇదేదో ఒకటిరెండు పోలీసుస్టేషన్‌లలో పరిస్థితి అనుకుంటే పొరబడినట్లే. జిల్లావ్యాప్తంగా తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, ఏర్పేడు, పుత్తూరు, సత్యవేడు, నాయుడుపేట పరిధిలోని దాదాపు అన్నీ పోలీసుస్టేషన్‌లలో ఇదే తీరు కనిపిస్తుందని జనం ఆవేదన. ప్రతిసోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక పేరుతో నిర్వహించే సదస్సులకు జిల్లా నలుమూలల నుండి ఎస్పీకార్యాలయంకు తరలివస్తున్న ప్రజలు చెబుతున్న మాటలు. అక్కడ పోలీసుస్టేషన్‌లకు వెళ్ళలేని పరిస్థితుల్లో ఇంతదూరం వచ్చి జిల్లా పోలీసుబాస్ (ఎస్పీని) కలుస్తున్నామని చెబుతున్న మాటలు. మరీ తిరుపతి యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం వంటి నగరంలో ఏ పోలీసుస్టేషన్‌కు ప్రజలు వెళ్ళాలన్నా అక్కడ ముందుగా తమకు తెలిసిన పోలీసు ఉన్నాడా?లేకపోతే వెళ్ళలేమనే మాటలు వినిపిస్తున్నాయంటే అతిశయోక్తిలేదు. సాధారణంగానే ప్రజలు నివాసముంటున్న తమప్రాంతాల్లో ,ఇంటివద్ద ఏదేని చిన్న గొడవలు జరిగినా, మద్యంమత్తులో ఘర్షణలు పడినా, చివరకు అమ్మాయిల వెంటపడినా ధైర్యంగా పోలీసుస్టేషన్‌కు బాధితులు వెళ్ళడమంటే కొంత ఇబ్బందికర పరిస్థితులేనని జనం నోట వినిపించే మాట. తమకు న్యాయం కోసం తప్పనిసరిగా స్టేషన్‌లకు వెళితే అక్కడ ముందుగా డ్యూటీ సెక్షన్ ఇన్‌ఛార్జిలు, స్టేషన్ రైటర్‌లు కనిపిస్తారు. అసలు వీరికంటే ముందే కొందరు పోలీసు కానిస్టేబుళ్ళు వచ్చిన వారిని ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, సమస్య ఏమిటీ?ఎప్పుడు ఎలా అనే యక్షప్రశ్నలుతో భయపెట్టేస్తున్నారు. దీంతో జనం అసలు కలవాల్సిన ఎస్ఐలు, సిఐలతో పనిలేకుండా కొందరు పోలీసులే కలగజేసుకుని ఇక్కడ నుండి వెళ్ళిపోండి...మేమొస్తాం అంటూ పంపేస్తున్నారు. ముఖ్యంగా తిరుపతిలో నిత్యం సాయంత్రం సమయాల్లో బాధితులతో, ఫిర్యాదిదారులతో అలిపిరి, ఈస్టు, తిరుచానూరు, ఎంఆర్‌పల్లి, వెస్టు పోలీసుస్టేషన్‌లు కిటకిటలాడుతుంటాయి. మరీ ఇక్కడ జనం ఎస్ఐలను కలసి తమ సమస్య విన్నవించుకొందామని అనుకుంటే పోలీసులే జోక్యం చేసుకుని కథ నడిపించేస్తుంటారు. ఇలాంటివి స్టేషన్‌ల వద్ద జరుగుతున్న తంతు. మరీ ఇక ఇతర ప్రాంతాల్లో పోలీసుస్టేషన్‌లలో పరిస్థితిని అంచనా వేయవచ్చు. కొన్ని పోలీసుస్టేషన్‌లలో సమస్యలు సిఐల దృష్టికి తీసుకెళ్ళకుండా ఒకరిద్దరు ఎస్ఐలు, పోలీసులు తమకు అనుకూలంగా మలచుకుని సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో ప్రతి పోలీసుస్టేషన్‌లో సిఐ అధికారి ఎస్‌హెచ్‌ఓగా వ్యవహరిస్తున్నారు. ముందుగా జనం వీరికి సమస్య తెలియజేస్తే ఆ తరువాత ఆ సమస్య తీవ్రతను బట్టి ప్రాంత ఇన్‌ఛార్జి ఎస్ఐకి, బ్లూకోల్ట్, పోలీసుపెట్రోలింగ్ సిబ్బందికి చెప్పి అక్కడ సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారు.అయితే కొందరు ఎస్ఐలు, తమకు అనుకూలంగా వుండే పోలీసుకానిస్టేబుళ్ళతోనే కథ మొత్తం నడిపించేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. తాత్కాలికంగా అప్పటికి సమస్య పరిష్కారమైనా మళ్ళీ ఎప్పుడైనా తీవ్రమైతే సిఐ అధికారి వరకు వెళుతుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్టేషన్‌లలో ఎస్ఐలు, క్రిందిస్థాయి పోలీసు సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాల్సిన సిఐలు కూడా ఒకింత చూసీచూడనట్లు ఉంటుండటంతో సిఐలంటే క్రిందిస్థాయి సిబ్బందిలో గౌరవం, భయం లేకుండాపోయిందని పోలీసుశాఖలో లుకలుకలు. మరీ జిల్లాకు పూర్వ, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఈ పరిస్థితుల్లో "మార్పు"తీసుకువస్తారని ప్రజల విశ్వాసం.

### ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా

## కలెక్టర్‌కు పురస్కారం

### - కె.విజయానంద్ చేతులు మీదుగా ప్రదానం

తిరుపతి కలెక్టరేట్, జనవరి 25 ప్రభాతవార్త ః



తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా శనివారం పురస్కారంను అందుకున్నారు. విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం -2025 కార్యక్రమం ఘనంగా జరిగింది. బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ పురస్కారాలు-2024కు సంబంధించి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చేతులు మీదుగా ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా పుర స్కారంను అందుకున్నారు. జిల్లా కలెక్టర్‌ను పలువురు అభినందించారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పరిపాలనలో తనదైన శైలిలో వ్యవహరించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కూడా ఉత్తమ ఎస్పీగా బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డులు 2024 కింద ఎంపిక అయ్యారు. అలాగే 122-వెంకటగిరి అసెంబ్లీ నియోజక వర్గ ఈఆర్ఓ బి. సుధారాణి ఉత్తమ ఈఆర్ఓగా, తిరుపతి అర్బన్ తహశీల్దార్ భాగ్యలక్ష్మి 167-తిరుపతి నియోజక వర్గం వారు ఉత్తమ ఏఈఆర్ఓగా, తిరుపతి నుంచి బీఎల్వో ఆర్. జ్యోతి, సత్యవేడు నుంచి ఎస్. పార్వతి ఉత్తమ బీఎల్వోలుగా, తిరుపతి కలెక్టరేట్ నుంచి బెస్ట్ డేటా ఎంట్రీ డీఈఓగా పవన్ కుమార్ పురస్కారాలను అందుకున్నారు.

## 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్‌గా నమోదు

### -నగరపాలక కమీషనర్ నారపరెడ్డి మౌర్య

తిరుపతిరూరల్, జనవరి25 ప్రభాతవార్త:



18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, 17సంవత్సరాలు నిండిన యువత ప్రాస్పెక్టివ్ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ నారపరెడ్డి మౌర్య సూచించారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2025ను పురస్కరించుకుని తిరుపతి ఆర్డీఓ కార్యాలయం నుండి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అధికారులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, సీనియర్ సిటిజన్స్, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం మహిళ వర్శిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మౌర్య మాట్లాడుతూ2024నాటికి 145కోట్ల మంది జనాభ ఉన్నారని, 99.1కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని, ఇంకా చాలామంది ఓటరు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు అన్నింటి కంటే ముఖ్యమైనది ఓటు హక్కని కులం, మతం, వర్గం, ధనిక పేద వర్గాల తేడా లేకుండా ప్రతి ఒక్కరికి 18 సంవత్సరాలు నిండినవారందరికి ఓటు హక్కును కల్పించిందన్నారు. మహిళా వర్సిటీ వి.సి.మాట్లాడుతూ 17,18,19 సంవత్సరాల యువతీ యువకులు ఓటరుగా నమోదు అయ్యేందుకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డిఆర్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యపరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం చీఫ్ ఎలక్షన్ కమిషన్ డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ శాలువ, పూలమాలవేసి సన్మానించారు.. అలాగే ఈఆర్ఓలకు, ఏఆర్ఓలకు, బిఎల్ఓలకు ప్రశంసా పత్రాలను అందజేసారు. 18 సంవత్సరాలు నిండిన కొందరు యువతకు ఓటరు గుర్తింపు కార్డులు అందజేసారు.

## ఉత్తమ ఎన్నికల నిర్వహణకు పురస్కారం

చిత్తూరు, జనవరి 25 ప్రభాతవార్త:



ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారంను అందుకుంటున్న ఎస్పీ మణికంఠ చందోలు

2024 సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ఎన్నికలను పక్కాగా నిర్వహించిన చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారంను అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలో శని వారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారంను రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ సమక్షంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఎస్పీ మణికంఠ చందోలుకు అందజేశారు. చిత్తూరు జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికలు పారదర్శకం గా, శాంతిభద్రతలతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించి పూర్తి చేసిన చిత్తూరు జిల్లా అధికారులు, సిబ్బంది ఎన్నికల ప్రక్రియ ప్రారం భమైనప్పటి నుండి పూర్తి అయ్యే వరకు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారం అందుకున్న ఎస్పీ మణికంఠ చందోలు అభినందనలు తెలిపారు.

## ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం

### - జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ ప్రారంభంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి

చిత్తూరు, జనవరి 25 ప్రభాతవార్త:



దేశంలోని ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని దేశ భవిష్యత్తును ముందుకు తీసుకెళ్ళే నాయకత్వంను ఎన్నుకోవాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పిలుపునిచ్చారు. చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద నుండి నాగయ్య కళాక్షేత్రం వరకు జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని శనివారం విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని గాంధీ విగ్రహం వద్ద జాయింట్ కలెక్టర్ జి.విద్యా ధరి జెండా వూపి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని దేశానికి మంచి నాయకత్వంను అందించే పాలకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కళావతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇస్రో నూతన సారథి ఆధ్వర్యంలో

## షార్‌లో 100వ రాకెట్ ప్రయోగం

### - జిఎస్ఎల్‌వి-ఎఫ్15కు అంతా సిద్ధం

శ్రీహరికోట (తడ), జనవరి 25 ప్రభాతవార్త



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నూతన ఛైర్మన్ వి.నారాయణన్ ఆధ్వర్యంలో షార్ నుంచి 100వ రాకెట్ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ నెల 29న ఉదయం 6.23 గంటలకు జిఎస్ఎల్‌వి-ఎఫ్15 పేరుతో ఈ ప్రతిష్టాత్మక 100వ ప్రయోగం జరగనుంది. ఈ రాకెట్ ద్వారా భారత నావిగేషన్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ఎన్‌విఎస్-02 ఉపగ్రహాన్ని ఇస్రో అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనుంది. జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో 170 కిలోమీటర్ల పెరిజి, 36,577 కిలోమీటర్ల అపోజిల మధ్య ఈ కీలక ఉపగ్రహాన్ని రాకెట్ ప్రవేశపెట్టాల్సి ఉంది. జిఎస్ఎల్‌వి సిరీస్‌లో ఇది 17వ ప్రయోగం. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రాకెట్ షార్‌లోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి నింగికి ఎగరనుంది. ఇస్రో నూతన సారథి నారాయణన్ గతంలో ఎన్నో రాకెట్ ప్రయోగ సమయాల్లో శ్రీహరికోటలోనే ఉండేవారు. ప్రస్తుతం ఆయన మొదటిసారి ఛైర్మన్ హోదాలో రాకెట్ ప్రయోగ సమయాన షార్‌లో ఉంటున్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు రిపబ్లిక్‌డే అనంతరం షార్‌కు రానున్నారు. ఈ 100వ ప్రయోగం విజయం సాధిస్తే భారత అంతరిక్ష పరిశోధన సంస్థతో పాటు మన శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి అఖండ పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని స్థానికులు ఆశిస్తున్నారు.

# ఆనకట్టను కూడా తవ్వేస్తున్నారు..

### రాత్రికి రాత్రే ఇసుక తవ్వకాలు

### అడ్డుఆపులేని ఆక్రమ రవాణా

**శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని స్వర్ణముఖి నదిని ఇసుక అక్రమార్కులు తవ్వేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు శ్మశానాన్ని వదలిపెట్టని అక్రమార్కులు నేడు పట్టణ సమీపంలోని స్వర్ణముఖి నదిని కరకట్టను కూడా వదలిపెట్టడం లేదు. స్వర్ణముఖి నది సమీపంలోని ఓ స్టార్ లాడ్జికి సమీపంలో కరకట్టను తవ్వేస్తున్నారు. రాత్రికి ఓ ఇన్నోవా కారులో వచ్చి కూర్చొని పార్టీ చేసుకోవటం లెక్కలేనన్ని ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని ఇసుకను తరలించేయటం పరిపాటిగా మారింది.**



రైటప్: కరకట్ట సమీపంలో తవ్వకాలు జరుపుతున్నదృశ్యం

శ్రీకాళహస్తి,జనవరి 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదిని ఇసుకాసురులు దోచుకుంటున్నారు. చిక్కి శల్యమైన స్వర్ణముఖి కళేబరాన్ని కూడా వదలి పెట్టడం లేదు.ఇక్కడ దేవస్థానం రోడ్డును నిర్మించాలని పరిశీలనలు జరుపుతున్న తరుణంలో ఇసుకాసురులు ఇక్కడ కన్ను వేసారు. దాంతో ఇక ఆలస్యం ఎందుకని తవ్వకాలను ప్రారంభించారు. కట్ట చివరి భాగంలో తవ్వకాలు ప్రారంభించారు. సమీపంలోని వారు ఎక్కడ స్వర్ణముఖికి వరద వస్తే మునకకు గురౌతుందో అని ఆందోళన చెందుతున్నారు.శ్రీకాళహస్తి రాజకీయ పార్టీల నాయకులకు ఎవరు అయితే అధికారంలో ఉంటారో వారికి కామధేనుగా మారింది.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం మునగలపాళెం,బండారుపల్లి శ్రీకాళహస్తి మండలంలోని వేడాం,చుక్కల నిడిగల్లు గ్రామాలతో పాటు పట్టణానికి సమీపంలోని మున్సిపల్ వాటర్ వర్క్స్,ఆలయానికి సమీపంలోనూ, ప్రస్తుతం కరకట్ట సమీపంలో తవ్వకాలు ప్రారంభించారు. పట్టణ పొలిమేరల్లోని బైపాస్ వద్ద హిందువుల శ్మశానంలో శవాలను కకూడా వదలిపెట్టకుండా గతంలో ఇసుకాసురులు తవ్వకాలు జరుపగా నేడు కూడా స్వర్ణముఖిని వదలిపెట్టడం లేదు.

**పట్టణంలో విచ్చల విడిగా ట్రాక్టర్లు:**

ప్రభుత్వం నిరుపేదల కోసం అందిస్తున్న వెసులుబాట్లు కొందరు వ్యాపారులకు వరంగా మారుతుంది.మూడు నెలల ముందు వరకు పట్టణంలో ఇసుక ట్రాక్టర్లు దర్శనమిచ్చేవి కాదు. కానీ నేడు పగలు రేయి తేడా లేకుండా పట్టణంలో ట్రాక్టర్లు సంచరిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అయినా పోలీసులు పెదవి విప్పే పరిస్థితి లేదు. ఏ ట్రాక్టర్‌ను ఆపితే ఏ రాజకీయ నాయకుని పేరు చెబుతారో అని భయభ్రాంతులౌతున్నారు.అసలే ఇరుకు రోడ్లు ట్రాక్టర్ల సంచారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులకు స్పష్టమైన ఆదేశాలతో స్వర్ణముఖి బచావ్‌కు సహకరించాల్సి ఉంది. లేదంటే రాబోవు రోజుల్లో మంచినీటి సమస్యను ఎదుర్కొవాల్సి వస్తోందనేది గ్రహించాల్సి ఉంది.

## గూడూరులో రాజ్యాంగ గౌరవ ర్యాలీ

గూడూరు, జనవరి 25, ప్రభాతవార్త



భారతీయ జనతా యువ మోర్చా బీజేవైఎం గూడూరు శాఖ ఆధ్వర్యంలో సంవిధన్ గౌరవ అభియాన్ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా బిజేవైఎం గూడూరు ఆధ్వర్యం లో రాజ్యాంగ గౌరవ ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్ మాట్లాడుతూ 75 సంవత్సరాల రాజ్యాంగ ఘన చరిత్రను ప్రజలకు వివరిస్తు రాజ్యాంగం అంటే ఒక పుస్తకం కాదు అది మన జీవితానికి దశా దిశాని బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశానికి ఇచ్చిన గొప్ప కానుక అన్ని పేర్కొనడం జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మరించుకుంటూ వారి ఆశయాలను విద్యార్థులకు యువకులకు ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించమని ఆయన తెలిపారు. అదేవిధంగా కిసాన్ మోర్చా కన్వీనర్ గాలి ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి దేశాన్ని ముందడుగు వేయించారని ఆయన పేర్కొన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం గూడూరు పట్టణ అధ్యక్షులు శివశంకర్ బీజేవైఎం నాయకులు ప్రణయ్ సుమన్, కార్తీక్ అదేవిధంగా విద్యార్థుల విద్యార్థులు యువకులు స్వర్ణాంధ్ర పార్టీ కళాశాల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా



**కల్లూరు, జనవరి 25, ప్రభాతవార్త** మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారిణి షమామ రహమాన్ మాట్లాడుతూ గ్రామాలలో అంటువ్యాధులపై అవగాహన కలిగిస్తున్నామని హై రిస్క్ కేసులను గుర్తించి చికిత్సలు అందిస్తున్నామని అన్నారు. పశు వైద్యాధికారి తబ్రిష్ భాష మాట్లాడుతూ గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పాడిరైతులు సద్వినియోగం చేసుకున్న విధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఆర్ ఐ దొరస్వామి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 6 సంవత్సరాలలోపు చిన్నారులు ఆధార్ కార్డు నమోదు చేసుకోవాలని అన్నారు. ఎంఈఓ పోకల తాతయ్య మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మతుకువారిపల్లి సర్పంచ్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ మతుకువారిపల్లి పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు బిల్లులు చెల్లించలేదని ఎప్పుడు చెల్లిస్తారని కోరగా ఎంఈఓ పోకల తాతయ్య అధికారులకు ప్రతిపాదన పంపామని అన్నారు. ఉద్యాన శాఖ అధికారిణి సంతోష్ కుమారి మాట్లాడుతూ రైతులు పంటల భీమా నమోదు చేసుకోవాలని కోరారు. మండల సమావేశానికి పంచాయతీరాజ్ కీలక అధికారులు పంచాయతీ కార్యదర్శులు హాజరు కాకపోవడం విశేషం. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఈశ్వరి వైద్యాధికారులు జానకిరావు, ఎల్లయ్య, ఫారెస్ట్ అధికారి మున్నా, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు బందోబస్తు చర్యలు చేపట్టారు.

## ఓటరుగా నమోదు చేసుకోండి

బంగారుపాళ్యం, జనవరి 25 ప్రభాతవార్త:



18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసిల్దారు రాజేంద్రప్రసాద్ కోరారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవంను బంగారుపాళ్యంలో రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ సంయుక్తంగా చేపట్టింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి జూనియర్ కళాశాల వరకు రహదారిపై ర్యాలీ చేపట్టి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రేడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం బంగారుపాళ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శేషాద్రి పాల్గొన్నారు.

## దారి సమస్య పరిష్కారం

**బంగారుపాళ్యం, జనవరి 25 ప్రభాతవార్త:** గత పదిహేను సంవత్సరాలుగా నెలకొని వున్న దారి సమస్యను శనివారం రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. మండలంలోని తంబుగానిపల్లికి చెందిన బాబు కలెక్టర్‌కు దారి సమస్యపై వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ సిబ్బంది దారి సమస్యను పరిష్కరించి దారి ఏర్పాటు చేశారు. ఇందులో తహసిల్దారు రాజేంద్రప్రసాద్, మండల సర్వేయర్ లావణ్య, విఆర్ఓ సురేంద్ర, గ్రామ సర్వేయర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలీశ్వరుడికి హుండీ ద్వారా రూ.3 లక్షలు ఆదాయం

బంగారుపాళ్యం, జనవరి 25 ప్రభాతవార్త:



స్వయంభూ శ్రీ మొగిలీశ్వర స్వామికి హుండీ లెక్కింపు ద్వారా 3 లక్షల రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజులు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుమనప్రియ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును ఆలయ సిబ్బంది చేపట్టారు. నాలుగు మాసాలకు సంబంధించి ఈ హుండీ లెక్కింపు చేపట్టగా స్వామి వారికి 3 లక్షల రూపాయలు ఆదాయం వచ్చిందన్నారు. అలాగే ప్రతి సోమవారం ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటు చేసిన హుండీ ద్వారా 57 వేల రూపాయలు ఆదాయం వచ్చిందని ఇఓ తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన

పాలసముద్రం, జనవరి 25 ప్రభాతవార్త:



పౌరులందరికీ ఓటు హక్కుపై విస్తృతంగా అవగాహన కల్పించి ఎన్నికల ఓటింగ్‌లో ప్రతి ఒక్కరు పాల్గొని ఓటును వినియోగించుకునేలా చేయాలని తహసిల్దారు అరుణకుమారి పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని శనివారం పాలసము ద్రంలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని తహసి ల్దారు అరుణకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు మార్కొండ నాయుడు, రామస్వామిలను తహసిల్దారు సత్కరించారు. అలాగే కొత్తగా ఓటర్లుగా నమోదైన ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన

గుడిపాల, జనవరి 25 ప్రభాతవార్త:




భారత రాజ్యాంగ చట్టాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి వారికి అవగాహన కల్పించడానికి శనివారం నుండి జనవరి 25వ తేదీ వరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంను భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తోందని జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్‌నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రం గుడిపాలలోని సిఎన్ఆర్ కళాశాలలో శనివారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జగదీశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి మార్గదర్శకత్వంలో సంవిధాన్ గౌరవ్ దివస్ నిర్వహిస్తూ 75 సంవత్సరాల రాజ్యాంగానికి గత పాలకులు చేసిన మార్పులు, చేర్పులతో ప్రజలకు ఏ విధంగా నష్టం కలిగించాయనే విషయంను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు, కళాశాల వ్యవస్థాపకులు లోకేష్, మండల బిజెపి అధ్యక్షులు రమాదేవి, బిజెపి నాయకులు రవికుమార్ బ్రహ్మానందరెడ్డి, రెడ్డిమస్తాన్, సోమనాథ్‌గౌడ్, ధనంజయనాయుడు, సాయిప్రతాప్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**పుత్తూరురూరల్, జనవరి 25 ప్రభాతవార్త:** గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పుత్తూరు మండలం తడుకు సమీపంలో జరిగింది. సీఐ సురేంద్రనాయుడు కథనం మేరకు..ఈశ్వరరావు కుమారుడు గోపి(37) తిరుపతిలో మెడికల్ స్టోర్స్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి సముదాయం నుంచి ద్విచక్రవాహనంపై తిరుపతికి వెళుతుండగా పుత్తూరు మండలం తడుకు సమీపంలో తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్రవా హనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో గోపి రోడ్డుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## నారా భువనేశ్వరిని కలసిన ప్రభుత్వ విప్ డా॥కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జనవరి 25 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. బెంగళూరులో టిడిపి ఫోరం అధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు గాను నారా భువనమ్మ బెంగళూరుకు చేరుకున్నారు. బెంగళూరు ఎయిర్‌పోం లో నారా భువనమ్మను ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పుష్పగుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు. కుప్పంలో తాజా పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు.

## వానగుట్టపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

కుప్పంరూరల్, జనవరి 25 ప్రభాతవార్త



మండలంలోని వానగుట్టపల్లిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వెటర్నరీ అధికారులు ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం. రాజగోపాల్ మాట్లాడుతూ పాడి రైతుల కోసం ఇదివరకే గోకులం షెడ్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఇప్పుడు పశుసంపద ఆరోగ్యంగా ఉండేలా ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా పశువులకు ఈగలు, పిడదల నివారణ మందులు పిచికారీ చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో నేతలు శివకుమార్, రవికుమార్, సర్పంచ్ పార్వతి రామచంద్ర, వార్డు సభ్యులు రఘుకుమార్, వసంత, సత్య, ఎఫ్ఎ పశుపతి, వైద్యాధికారి సుబ్రమణ్యం, శేఖర్ పాల్గొన్నారు.

## 15 వ జాతీయ ఓటర్ దినోత్సవం

పూతలపట్టు, జనవరి 25, ప్రభాతవార్త



15వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని శనివారం పూతలపట్టు ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తాసిల్దార్ గురప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ పౌరుడికి గుర్తింపు నిచ్చేది ఓటు హక్కు నేడు దేశంలో ఉన్న 18 సంవత్సరాలు నిండిన యువత యువకుల అందరికీ విధిగా ఓటు హక్కు కలిగి ఉండాలని ప్రభుత్వం లక్ష్యం ప్రతి ఏడాది జనవరి 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటర్ నమోదు చేసుకోవాలను కునేవారు ఓటర్ జాతీయ పేర్లు చేర్చుకోవడం కోసం 6 ఏ ఫారం ను నమోదు చేసి సమీపంలోని బిఎల్ఓకు అందించాలి ఒక ఫారం 7 లో పేర్లు తొలగించటంకు ఉపయోగించుకోవచ్చు. దేశభక్తి గీతానికి నృత్యం చేసిన బాలికలకు బహుమతిలు ధృవీపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాసులు డిటి మునిరత్నం గ్రంథాలయ అధికారి తాళ రవీంద్రబాబు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమూల్యమైన ఓటును అమ్ముకోవద్దు

చౌడేపల్లి, జనవరి 25 ప్రభాతవార్త



అమూల్యమైన ఓటును రాజకీయ నాయకులకు అమ్ముకోవద్దని పలువురు వక్తలన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ హనుమంతు, ఎస్ఐ నాగేశ్వరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నతపాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులచే ర్యాలీలు, మానవ హారాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలందించారు. ఓటును ఎక్కువ సార్లు వినియోగించుకొన్న సీనియర్ సిటిజన్లు దొరస్వామి, కృష్ణమూర్తి, ప్రభావతమ్మలను దుశ్శాలవాలతో సత్కరించారు. రాజ్యాంగంకల్పించినపవిత్రమైనఓటుహక్కునుసద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దకొండామర్రి(చౌడేపల్లి), జనవరి 25 ప్రభాతవార్త

మండలంలోని పంచాయతీ కేంద్రం దుర్గసముద్రంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మేకలు, గొర్రెలకు 2వ విడత నట్టల నివారణ మందులు పంపిణీ చేసారు. వీటితో పాటు పశువులకు సోకే గర్భకోశ వ్యాధులు, చూడి నిర్ధారణా పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. పశువుల్లో సోకే పలు వ్యాధులపట్ల రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, సిబ్బంది రెడ్డిప్రసాద్, మహమ్మద్దాలి, నందకుమార్, గోవర్ధన్, పాడి రైతులు పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకన్నకు తిరుమంజన సేవ

పుంగనూరు రూరల్, జనవరి 25, ప్రభాతవార్త



పట్టణంలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో పుష్య మాసం మూడవ శనివారం బహుళ ఏకాదశి ఉదయం 5 గంటలకు స్వామి అభిషేకము, తిరుమంజనము నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు విశ్రాంతి డిఎస్పి కనుకుంట సుకుమార్ కుటుంబీకులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ జె. మునీంద్రబాబు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, శ్రీకాంతాచార్యులు ఆలయ సిబ్బంది చంగప్ప పాల్గొన్నారు.

## సంఘమిత్రలు బాధ్యతతో పనిచేయాలి

పుంగనూరు, జనవరి 25, ప్రభాతవార్త



సంఘమిత్రలు బాధ్యతగా పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవ రెడ్డి కోరారు. శనివారం పుంగనూరు మండల కార్యాలయంలో సంఘమిత్ర లతో సమావేశం నిర్వహించారు. మహిళలు ఆర్థిక వృద్ధులకు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంఘ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను దృష్టిలో ఉంచుకొని అలా జరగకుండా బాధ్యతగా పనిచేయాలని సంఘ మిత్రలకు సూచించారు.



## ఘనంగా ఓటర్ల దినోత్సవం

పుంగనూరు రూరల్, జనవరి 25, ప్రభాతవార్త

నియోజకవర్గ వ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని రెవెన్యూ శాఖ శనివారం ఘనంగా నిర్వహించింది. పట్టణంలో తహసిల్దార్ రాము ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత లినార్డ్ స్కూల్లో సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ ఓటర్లను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణంరాజు, టీడీపీ నాయకులు సివిరెడ్డి, దేశాది ప్రకాష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైన విశ్వం పాఠశాల విద్యార్థులు

గంగాధర నెల్లూరు, 25 జనవరి ప్రభాతవార్త:




మండల పరిధిలోని సుందరాజపురం వద్ద ఉన్న విశ్వం పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీలలో 5వ తరగతి నుంచి ఎం.రేవంత్ 4వ తరగతి నుంచి బి.సుహాన్ 3వ తరగతి నుంచి ఎ.విష్ణు రెడ్డి విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్లు జయచంద్ర, చిటబాబులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయని ఉపాధ్యాయులు అభినందించారు రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి పాఠశాల పేరుని తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోండి

గంగాధర నెల్లూరు 25 జనవరి ప్రభాతవార్త:



అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసిల్దార్ చంద్రశేఖర్ అన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల మీదుగా బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీని నిర్వహించి అనంతరం ఓటు హక్కు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీని పురవీధులలో కొనసాగించారు. ఓటు హక్కు పొందిన వారు విధిగా ఓటును వినియోగించుకోవాలని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటును నమోదు చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయని ఉపాధ్యాయులు విద్యార్థులు తహసిల్దారు కార్యాలయ సిబ్బంది బి ఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు సద్వినియోగం అందరి బాధ్యత

– ఆర్డీఓ శ్రీనివాసులు రాజు

– ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం.. సీనియర్ సిటిజన్లకు సత్కారం !!



కుప్పం, జనవరి 25 ప్రభాతవార్త

ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడం అందరి బాధ్యత అని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలుర హైస్కూల్‌లో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన వారు ఓటుహక్కు పొందవచ్చన్నారు. ఎన్నికల సంఘం సైతం ఓటర్ల జాబితాలు పారదర్శకంగా ఉండేలా చూడాలని ఆదేశించిందన్నారు. ఎన్నికల్లో ఓటు కలిగిన వారు తమ ఓటును తప్పక వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థినులు చేపట్టిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. అనంతరం కుప్పం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ చిట్టిబాబు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, అర్బన్ సిఐ శంకరయ్య, ఎంఇఓ మహబూబ్ బాషా, ఆర్ఐ వేణుగోపాల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, మైనార్టీ సెల్అధ్యక్షుడుజాకీర్, విఆర్వోశ్రీకాంత్, విశ్రాంతహెచ్ఎంవెంకటేష్, ఉపాధ్యాయులు సురేంద్ర పాల్గొన్నారు.

## కుప్పం వ్యవసాయాధికారిగా ఫయాజ్ బాషా బాధ్యతలు

కుప్పం, జనవరి 25 ప్రభాతవార్త



కుప్పం మండల నూతన వ్యవసాయాధికారిగా ఆర్ఎస్. ఫయాజ్ బాషా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పుంగనూరునుంచి బదిలీపై కుప్పం వచ్చారు. ఇక్కడ ఎఓగా పనిచేస్తున్న అమృతవల్లి ప్రకృతి వ్యవసాయ విభాగానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఎఓ ఫయాజ్ బాషా మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండడంతో పాటు రైతుల్ని చైతన్య పరచి వారు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులు పాటించేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఉద్యానవన, పట్టుశాఖల అధికారుల సమన్వయంతో రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతుల అభివృద్ధికి తాము పనిచేస్తామన్నారు. అనంతరం నూతన ఎఓను ఘనంగా సత్కరించారు.

## అనధికారికంగా మద్యం విక్రయాలు.. ముగ్గురు అరెస్ట్

కుప్పం, జనవరి 25 ప్రభాతవార్త

కుప్పం మండలంలో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారినుంచి సుమారు 72వేల రూపాయల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు. నడిమూరు చెక్‌పోస్ట్ వద్ద చిల్లర దుకాణంలో మద్యం విక్రయిస్తున్న శబరీష్ (32), బాబు(32)లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ 58788ల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగేమండలంలోని వెండుగ ంపల్లి వద్ద ఓ హోటల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మూర్తి అలియాస్ రెమో (38)ను అరెస్ట్ చేసి 14,130రూ.ల విలువ చేసే మద్యం పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



## క్రీడలతో మానసికోల్లాసం సాధ్యం

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్

– కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు !!

కుప్పం, జనవరి 25 ప్రభాతవార్త

విద్యార్థులకు క్రీడలు ఎంతో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో వార్షిక క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు సైతం పొందవచ్చన్నారు. దీనికితోడు శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపు నిచ్చారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలిచిన విద్యార్థినీ విద్యార్థులకు ట్రోఫీలు, షీల్డ్‌లు బహుమ తులుగా అందించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, పిడి సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**పూతలపట్టు, జనవరి 25, ప్రభాతవార్త** మండల పరిధిలో రంగంపేట క్రాస్ గువ్వల కాలనీ నుండి చిత్తూరు తిరుపతి హైవే జాతీయ రహదారి శుక్రవారం రాత్రి 12 గంటలకు రోడ్డు దాటుతుండగా సంఘటన జరిగింది. వివరాలు స్థానిక తేనేపల్లి పంచాయతీ బిల్లార్ మిట్ట కాలనీకి చెందిన లేట్ నాగరాజు కుమారుడు నవీన్ వయసు 26 రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనాలు ఢీ కొట్టడంతో అక్కడక్కడ మృతి చెందాడు. సమాచారం మేరకు సిఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## నేడు సబ్‌స్టేషన్ ప్రారంభం

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం చిందేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ఆదివారం శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. చిందేపల్లి నిరుపేదల కాలనీకి సంబంధించి విద్యుత్ సమస్య దీర్ఘకాలంగా ఉంది. ఈ సమస్యను గ్రామస్థులు శాసనసభ్యుని దృష్టికి తెచ్చారు. దాంతో కొత్త సబ్‌స్టేషన్ ను అధికారులునిర్మించారు. దాంతో ఒరెండు గ్రామాల సమస్య పరిష్కారం అయ్యింది.

## పట్టణ ఎస్ఎఫ్ఐ మహిళా అధ్యక్షురాలుగా ప్రవళిక

శ్రీకాళహస్తి, జనవరి 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణ ఎస్ఎఫ్ఐ మహిళా అధ్యక్షురాలుగా ప్రవళికను ఏక గ్రీవంగా ఎన్ను కున్నారు. స్థానిక పుచ్చల పల్లి సుందరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ పట్టణ విద్యార్థి సమాఖ్య మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యక్షురాలు ఎన్నికల్లో దాసరిప్రవళికను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రవళిక మాట్లాడుతూ నేడు విద్యార్థులు ముఖ్యంగా మహిళ విద్యార్థులు ఎ న్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని యూనియన్ పిలుపును ఆచరించి అధికారుల దృష్టికి తెస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడుచుట్టు గురవయ్య, దేవిడ్, మునిలక్ష్మి, రాధ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

**కెవీబీ పురం, జనవరి 25 ప్రభాతవార్త:** దేశ భవిష్యత్ తీర్చిదిద్దడంలో యువత ఓటింగ్ కీలకంగా మారినట్టు తహసీల్దార్ మునిరత్నం తెలిపారు. శనివారం ఓటర్ల దినోత్సవంపై మండల కేంద్రమైన కేవీబీ పురంలో మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి సాయిబాబా ఆలయం వరకు తహసీల్దార్ అధ్యక్షతన భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతరం ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించడం కోసమే ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఆయన గుర్తు చేశారు.

## మామిడిలో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడి

**కేవీబీ పురం, జనవరి 25 ప్రభాతవార్త:** ఎగువపూడి, కేవీబీ పురం మండలంలో రాస్ కేవీకే, కరకంబాడి వారి ఆధ్వర్యంలో మామిడిలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాల కారణంగా మామిడిలో పూత ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని, అలాగే నేలలో అధిక తేమ వలన తేనె మంచు పురుగు ఆశించి ఆకుల మీద కాని, పూత కాడల మీద కాని జిగురు వంటి పదార్థాన్ని స్రవించడం కారణంగా వచ్చిన పూత మగ్గిపోతుందని తెలియజేశారు. తేనె మంచు పురుగు ఉధృతి పెరగడంతో పాటు పక్షి కన్ను తెగులు, పూత మాడు తెగులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 2 మిల్లీలు, కాపర్ ఆక్స్ క్లోరైడ్ 3 గ్రాములు, ప్రొపినెట్ 2 గ్రాములు, మాంకోజెబ్ 2.5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పద్మజ, రాముకుమార్, ఉద్యాన అధికారిణి రాధారాణి పాల్గొన్నారు.

## వైద్య కళాశాలలో హిందూస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్



**తిరుపతి హెల్త్, జనవరి 25 ప్రభాతవార్త :** ఎస్వీ వైద్య కళాశాలలో హిందుస్థాన్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలలో తొలిసారి హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం, సామాజిక సేవలు, మెరుగైన సమాజాన్ని నిర్మించడానికి పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో స్కౌట్ అండ్ గైడ్స్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్కౌట్స్ అండ్ గైడ్స్ వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ తెరెసా రాణి స్కౌట్ అండ్ గైడ్స్ కమిషనర్ తుంగ శ్రీకాంత్, డిస్టిక్ సెక్రటరీ దయాకర్, డిస్టిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకట సుమంత్, ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ నవీన్, వైద్య కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ కో-ఆర్డినేటర్లు, వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులు, పీఆర్వో వీర కిరణ్ పాల్గొన్నారు.

## ఏపీడబ్ల్యుజెఎఫ్ నూతన కమిటి ఏకగ్రీవ ఎన్నిక

కాణిపాకం, జనవరి 25 ప్రభాతవార్త:

ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(ఏపీడబ్ల్యుజెఎఫ్) పూతలపట్టు నియోజకవర్గ నూతన కమిటి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి చల్లా జయచంద్ర తెలిపారు. శనివారం కాణిపాకంలో పూతలపట్టు నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం ఏపీడబ్ల్యుజెఎఫ్ చిత్తూరు జిల్లా కో-కన్వీనర్ ఆర్.చంద్ర అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సమావేశంలో నూతన కమిటిని ఎన్నుకున్నట్లు చల్లా జయచంద్ర ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షులుగా లక్ష్మీపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.సురేంద్ర, గౌరవా ధ్యక్షులుగా జి.మంజునాథ్, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, బాల, జ్యోతినాథ్, ప్రధాన కార్యదర్శిగా శంకరన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ప్రతాప్‌రెడ్డి, ఎస్.నాగరాజు, కోశాధి.కారిగా బాలాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ ఆర్. చంద్ర, జిల్లానాయకులుఎ.కేశవులు, ప్రకాష్, బాలసుబ్రమణ్యం, పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



శ్రీకాళహస్తి, జనవరి 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని రద్దీగా ఉండే కూడలి ప్రాంతాల్లో రోడ్ల మీదకు వచ్చి దుకాణదారులకు శనివారం పోలీసులు చైతన్యవంతుల్ని చేసారు. ముఖ్యంగా రిపబ్లిక్లబ్ నుంచి పాత నెల్లూరు బస్టాండు, ఆర్‌టిసి బస్టాండు రోడ్డు, ఆర్‌టిసి కూడలిలో డివైయస్‌పి నరసింహారాజు, సిఐ డి.గోపిలు శనివారం ఉదయమే ఇక్కడ ప్రత్యక్షమయ్యారు. ఈ సందర్భంగా కాలువ నుంచి సుమారు 6 నుంచి 8అడుగులు ముందుకు వచ్చిన దుకాణ దారులను చైతన్యవంతుల్ని చేసి వెనుకకు జరిపించారు. ముఖ్యంగా ఆర్‌టిసి బస్టాండు రోడ్డు, ఆర్‌టిసి బస్టాండు సర్కిల్‌లలో దుకాణాదారులు రోడ్డు మార్జిన్‌కు వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఒకర్ని చూసి ఒకరు పోటీలు పడి ముందుకు రావటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం డివైయస్‌పి ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసారు. కొన్ని మాంసం, చికెన్ దుకాణాలను మూయించారు. ఇక ఈ ప్రాంతాలు ఎప్పుడూ రద్దీ ఉంటాయని ఇక్కడ ప్రతి దుకాణం దారుడు ముందుజాగ్రత్తగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాదుల్లో

